ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 10 నవంబరు 2025



అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకిస్తూ...



కుంకీల విన్యాసాలను సెల్‌ఫోన్లో బంధిస్తూ...





పవన్‌కల్యాణ్ రాక కోసం ఎదురుచూస్తున్న అభిమాన జనం

ముసలిమడుగులో రెండు గంటలు

● ఆద్యంతం చలాకీగా పవన్

పలమనేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆయన్ను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు ఎగబడ్డారు. వారి తాకిడిని తట్టుకోలేక పోలీసులు ఆ ప్రాంతమంతా ఆంక్షలు విధించారు. షెడ్యూల్ కంటే గంట ఆలస్యంగా పలమనేరు సమీపంలోని పెంగరగుంట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్న పవన్‌కు స్వాగతం పలికేందుకు కేవలం 8మందినే లోపలికి అనుమతించారు. జనసేన నాయకులు చాలామందికి అనుమతి లభించకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్,కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్, డీఎఫ్‌వో సుబ్బరాజు తదితరులు పవన్‌కు స్వాగతం పలికారు. హెలిపాడ్ చుట్టూ తన కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు పవన్ అభివాదం చేశారు. ఎమ్మెల్యే గురజాల సూచన మేరకు తమిళనాడు నుంచి వచ్చిన అభిమానుల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. హెలిపాడ్ బయట పలువురు ఆయనకు సమస్యల మీద అర్జీలు ఇచ్చారు. అక్కడి నుంచి కారులో నేరుగా ఎలిఫెంట్ క్యాంపు వద్దకు వెళ్లిన పవన్ అటవీశాఖ అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ఏనుగులతో మనుషులకు జరుగుతున్న అన్నిరకాల నష్టాల్ని తగ్గించే చర్యలు' అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రజంటేషన్ చూశాక అధికారులకు పలు సూచనలు చేశారు. హనుమాన్ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు.కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించారు.దాదాపు రెండుగంటల పాటు ముసలిమడుగులో వున్న పవన్ ఆద్యంతం చలాకీగా గడిపారు.



నిరాశలో జనసేన శ్రేణులు

తమ పార్టీ అధినేత డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి జిల్లాకు రావడంతో జనసేన శ్రేణులు మురిసిపోయారు. తాము కలిసే అవకాశం ఉంటుందని, మాట్లాడి ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుందని భావించినా వారికి నిరాశే మిగిలింది. సాధారణంగా సీఎం చంద్రబాబు జిల్లాల్లో పర్యటించినప్పుడు టీడీపీ ముఖ్య శ్రేణుల కోసం సమయాన్ని కేటాయిస్తారు. అలాగే లోకేశ్ పర్యటనల్లో శ్రేణుల కోసం సమయం కేటాయించి ఫొటోలు తీసుకుంటారు. ఆదివారం పవన్ కూడా అలా శ్రేణుల్ని, కనీసం నాయకుల్ని పలకరిస్తారని ఆశించారు. జనసేన నాయకులతోనే కాకుండా టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కూడా సమయాభావం వల్ల రిజర్వుడ్‌గానే వ్యవహరించారు.

మంగళంపేట అటవీ భూముల ఏరియల్ సర్వే

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని అటవీ భూములను ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏరియల్ సర్వే నిర్వహించినట్లు అటవీశాఖ రేంజర్ థామస్ సుకుమార్ తెలిపారు. మంగళంపేట సమీపంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన వ్యవసాయ భూములకు సమీపంలో అటవీభూమి అక్రమణకు గురైందని ఈ ఏడాది జనవరిలో కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో తదితర అధికారులు పరిశీలించారు. అనంతరం అక్రమణకు గురైన అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం పలమనేరు పర్యటనకు వెళుతూ ఏరియల్ సర్వే చేపడతారని అటవీశాఖ అధికారులు ఉదయంతోనే అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎంకు కనిపించేలా ఆ ప్రాంతంలో ఎరుపు రంగు జెండాను నాటి మంటలు రాజేసి పొగపెట్టారు.పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటనలు ముగించుకొని తిరిగి వెళుతూ మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేసినట్లు రేంజర్ తెలిపారు.





తోపులాటలో మహిళకు గాయాలు

ఎలిఫెంట్ క్యాంపును సందర్శించి తిరిగి హెలిప్యాడ్‌కు డిప్యూటీ సీఎం వెళ్తుండగా మార్గమధ్యంలోని ఇందిరానగర్ వద్ద పవన్ అభిమానులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. హేమ అనే మహిళ అభిమానంతో హారతి ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు, అక్కడున్న అభిమానులు పక్కకు తోయడంతో ఆమె కాలికి గాయాలయ్యాయి.'ఆమెను పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి అన్ని పరీక్షలు నిర్వహించగా, ఎడమకాలికి చిన్న గాయమైందని..ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంగా వివిధ టీవీ ఛానెళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు.



కుంకీల కోసం చేసిన కృషిని వివరించిన అమర్

అడవి ఏనుగుల ద్వారా మనుషుల ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టం కలుగుతోందని, కుంకీ ఏనుగులతోనే దీన్ని నివారించవచ్చని గుర్తించాను.అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మీకు ఈ విషయంగా అర్జీ ఇచ్చాను. అసెంబ్లీలో ఇదే విషయమై రెండుసార్లు మాట్లాడానంటూ పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చెప్పారు.తానీ విషయంలో చేసిన కృషికి సంబంధించిన రికార్డులను పవన్‌కు అందించారు.అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సమయంలో ఏనుగుల మంద కంటే ఒంటరి ఏనుగులతోనే ఎక్కువ ప్రమాదమంటూ వివరించబోయిన అమర్‌ను తాను మాట్లాడతానంటూ పవన్ వారించడం ఎమ్మెల్యేని నొచ్చుకునేలా చేసింది.



రైతులతో ముఖాముఖి రద్దు

ఏనుగుల దాడుల్లో నష్టపోయిన బాధిత రైతులతో పవన్ మాట్లాడేలా రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఎలిఫెంట్ క్యాంపు శిలాఫలకాల ఆవిష్కరణ అనంతరం అక్కడే రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ శిలాఫలకాల ఆవిష్కరణ అనంతరం పవన్ హుటాహుటిన కారులో హెలిపాడ్‌కు వెళ్లిపోవడంతో రైతులు నిరుత్సాహ పడ్డారు.మీడియా సమావేశం కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీ వద్దకు కూడా ఆయన రాలేదు. పవన్‌ను చూసేందుకు ఎలిఫెంట్ క్యాంపు వెలుపల వందలాదిమంది అభిమానులు ఎదురు చూసినా వారిని పోలీసులు తరిమివేయడంతో నిరాశపడ్డారు.

డీఎఫ్‌వో ఎఫ్ఏసీగా శ్రీనివాసులు



చిత్తూరు సెంట్రల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా అటవీ శాఖ డీఎఫ్‌వో (ఎఫ్ఏసీ)గా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇటీవలే జిల్లాకు డీఎఫ్‌వోగా వచ్చిన సుబ్బరాజు రెండు నెలల పాటు శాఖాపరమైన శిక్షణ నేపథ్యంలో సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో పుట్టపర్తి జిల్లా డీఎఫ్‌వోగా పనిచేస్తున్న శ్రీనివాసులును చిత్తూరు జిల్లా డీఎఫ్‌వో ఎఫ్ఏసీగా నియమిస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈయన 2015 నుంచి 2021 మధ్య అప్పటి అటవీశాఖ పశ్చిమ విభాగం డీఎఫ్‌వోగా పనిచేశారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. జిల్లాస్థాయి అధికారులంతా విధిగా హాజరుకావాలని సూచించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ.. : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ గడువు పెంపు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు9 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల్లో గృహ విద్యుత్ వినియోగదారులు అదనంగా ఉన్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ కోరారు. ఇంకా చాలామంది వినియోగదారులు చేసుకోని కారణంగా డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో దరఖాస్తులో పొందుపరచిన లోడ్‌కంటే అదనంగా వాడిన వారు తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. కిలోవాట్‌కు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.1.61కోట్లు విడుదల

● ఉమ్మడి జిల్లాలో 26 పాఠశాలల్లో ఊపందుకోనున్న పనులు

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగుదల, పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.61కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 పాఠశాలల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఎలక్ట్రిఫికేషన్, ప్రధాన మరమ్మతుల కోసం ఈ నిధులు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నిధుల వినియోగం, అమలు, పనుల పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాలల నిర్వహణ కమిటీలకు అప్పగించింది. మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది.

తిరుపతి జిల్లాకు రూ.60.90లక్షలు : తిరుపతి జిల్లాలో 9 పాఠశాలల్లో నాలుగింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో మరుగుదొడ్లు, రెండింటిలో ప్రధాన మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకుగాను రూ.60.90 లక్షలు కేటాయించారు. **చిత్తూరు జిల్లాకు రూ.1.01 కోట్లు :** చిత్తూరు జిల్లాలో 17 పాఠశాలలకుగాను ఏడింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో బాలుర మరుగుదొడ్లు, ఆరింటిలో బాలికల మరుగుదొడ్లు, ఒక్క పాఠశాలలో ఎలక్ట్రిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.1.01 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

వన్యప్రాణి సంరక్షణే హనుమాన్ లక్ష్యం

● ప్రత్యేక టీముల ఏర్పాటు, శిక్షణ
● డివిజన్‌కు ఒక అంబులెన్స్ అందుబాటులోకి
● ప్రత్యేక వెటర్నరీ డాక్టర్ నియామకం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల సంరక్షణ, చికిత్స, పునరావాసం కోసం రూపొందించిన హీలింగ్ అండ్ నర్చరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్ ఎయిడ్ అండ్ వైల్డ్ లైఫ్ (హనుమాన్) ప్రాజెక్టును విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.పలమనేరు మండలం ముసలిమడుగులో ఆదివారం ఆయన హనుమాన్ ప్రాజెక్టుపై పలు సూచనలు చేశారు. దీంతో అటవీ శాఖ అధికారులు హనుమాన్ ప్రాజెక్టుపై ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో పడ్డారు.కోతులు, పాములు, ఏనుగులు, పులులు, సింహాలు, జింకలు.... ఇలా అన్ని రకాలైన వన్యప్రాణులను సంరక్షించడం, వాటి బారి నుంచి మనుషులను కాపాడడం, వన్యప్రాణులకు వేటగాళ్ల నుంచి ప్రాణహాని లేకుండా చూడటం హనుమాన్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.ఏ జంతువు ద్వారా కూడా ఎవరికీ ఇబ్బంది రాకుండా, వాటి ఉత్పత్తి పెంచడం, తగ్గించడంపైనా దృష్టి సారించనున్నారు. ఉదాహరణకు కొన్ని ప్రాంతాల్లో కోతుల ద్వారా సమస్యలు ఏర్పడితే వాటి సంతతిని క్రమబద్ధీకరించడం, ఉత్పత్తి తగ్గిన సమయంలో సంతతిని పెంచడం హనుమాన్ ప్రాజెక్టులో భాగం. ఈ ప్రాజెక్టు కింద ప్రతి జంతు జాతికి సంబంధించి ఒక టీమును ఏర్పాటు చేయనున్నారు. వారికి ఆ జంతువుకు సంబంధించిన సంరక్షణ, పోషణ,ఉత్పత్తి, ప్రమాదాల బారిన పడిన సమయంలో వాటికి ఎలాంటి వైద్యం చేయాలనే దానిపై శిక్షణ ఇవ్వనున్నారు. గాయపడిన, ప్రమాదాల బారిన పడిన వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖలో ప్రతి డివిజన్‌కు ఒక అంబులెన్స్‌ను అందుబాటులో వుంచనున్నారు.పశువైద్యానికి అవసరమైన మందులన్నీ అంబులెన్స్‌లో వుంటాయి.





వరసిద్ధుడి సేవలో రష్యన్లు

ఐరాల(కాణిపాకం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని రష్యన్ దేశస్తులు పది మంది ఆదివారం దర్శించుకున్నారు. వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పీఆర్వో కార్యాలయ ఉద్యోగి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక ఆలయంలో రష్యన్ భక్తులు

చిన్నగొట్టిగల్లు 'విండో'లో ఉద్యోగి చేతివాటం

● నకిలీ బంగారం కుదువపెట్టి రూ.72లక్షలు స్వాహా చేసినట్లు వెలుగులోకి ● విచారణకు ఆదేశించిన డీసీసీబీ సీఈవో

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సింగిల్‌విండోలో నకిలీ బంగారాన్ని కుదువపెట్టి అక్కడి ఉద్యోగే రూ.72 లక్షలు స్వాహా చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా సమగ్ర విచారణకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) సీఈవో శంకర్‌బాబు ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. చిన్నగొట్టిగల్లు విండోలో కొన్నేళ్లుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా జగదీశ్ పనిచేస్తున్నారు. కె.రెడ్డెమ్మ, సి.రుతున్ పేర్లతో ఈ ఏడాది జనవరి 18, 21, ఫిబ్రవరి 11 తేదీల్లో 1,235 గ్రాముల నకిలీ బంగారం (వన్‌గ్రామ్ గోల్డ్)ను 29 సంచుల్లో కుదువపెట్టి రూ.72 లక్షలు స్వాహా చేశాడు. ఈనెల 4వ తేదీన బంగారం నగల కుదువ తనిఖీల్లో బ్రాంచి మేనేజర్ లక్ష్మీప్రసాద్ ఈ వ్యవహారాన్ని గుర్తించారు. దీనిపై ప్రాథమిక నివేదికను డీసీసీబీ ఉన్నతాధికారులకు ఆయన పంపారు. పరిశీలించిన అధికారులు సమగ్ర విచారణకోసం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఏజీఎం సురేష్‌బాబును విచారణాధికారిగా నియమించారు. సోమవారం నుంచి విండోలో సమగ్ర విచారణ ప్రారంభం కానుంది. ఇదిలా ఉండగా సీఈవో జగదీశ్ పనితీరుపై ఆరేళ్ల కాలానికి(2019-25) విచారణ జరపాలని విండో చైర్మన్ ముత్తా ప్రభాకర్ బ్యాంకు అధికారులను కోరారు. నకిలీ బంగారం కుదువ వ్యవహారంలో అప్రైజర్ తీరుపైనా విచారణ జరగనుంది. విచారణ పూర్తయ్యాక దీనివెనుక ఇంకెందరున్నారన్నది బయటపడనుంది.

తనిఖీ చేయలేదా?

ప్రతి మూడు నెలలకు ఒకసారి విండోల్లో, బ్యాంకు బ్రాంచీల్లో తనిఖీలు జరుగుతాయి. మరి ఈ ఏడాది జనవరిలో జరిగిన ఈ నకిలీ బంగారం కుదువ వ్యవహారంపై ఏప్రిల్, ఆగస్టు నెలల్లో అధికారులు ఎందుకు తనిఖీ చేయలేదు.. లేదా తనిఖీ చేసిన అధికారులు ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదా? అన్న కోణంపైనా ఉన్నతాధికారులు దృష్టిపెడుతున్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదివారం తెలిపారు. సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వినియోగదారులు 8977716661కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు. లేదంటే 9133331912కు మెసేజ్ పెట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో లోకాయుక్త రజని



లోకాయుక్త రజనికి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈఈవోలు రవీంద్రబాబు, ధనపాల్

ఐరాల(కాణిపాకం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో లోకాయుక్త రజని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర దంపతులైతే కల్యాణ వస్త్రాలతో స్వామి సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయాధికారులు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ లోకేశ్వరి, ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి ఆదివారం నాలుగు గంటల సమయం పట్టింది. సెలవు రోజు కావంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు పూర్తిగా నిండి పోయి ఆలయం వెలుపల వరకు వ్యాపించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

నేటినుంచి పవిత్రోత్సవాలు

వరసిద్ధుడి ఆలయంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలను మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిశోర్ తెలిపారు. ఆలయంలో పవిత్ర పూర్ణత్వసిద్ధి పొందుటకు, లోక క్షేమం కోసం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

1.25 కిలోల గంజాయి స్వాధీనం

● మహిళ అరెస్టు

నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ఓజీ కుప్పం గ్రామంలో కరియమాణిక్యస్వామి ఆలయం వద్ద నివాసం ఉంటున్న లింగేశ్వరి అలియాస్ జ్యోతి(47) వద్ద 1.25 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని అరెస్టు చేసినట్లు నగరి సీఐ విక్రమ్ తెలిపారు. గతంలోనూ ఈమె గంజాయి విక్రయిస్తుండగా నగరి పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులు, పుత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసు నమోదై ఉన్నాయన్నారు. ఎన్నిసార్లు హెచ్చరించినా గంజాయి విక్రయిస్తుండడంతో ఆమెపై నిఘా ఉంచి ఆదివారం అరెస్టు చేశామని సీఐ వివరించారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగవరం, ఎస్ఐ విజయ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో రూ.2వేల కోట్లతో పరిశ్రమలు

● రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రూ.2వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. నాయుడుపేట సెజ్ పరిధిలో రూ.200 కోట్ల పెట్టుబడులతో 3ఎక్స్‌ఫర్ ఇన్నోవేచర్ లిమిటెడ్ ఫార్మసుటికల్స్ ప్రారంభం కానుంది. ఇందులో 300మందికి పైగా ప్రత్యక్షంగా, మరో వందమందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. అక్కడే రూ.300 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారుచేసే దమ్ము బయో ఫ్యూయల్స్ కంపెనీకి శంకుస్థాపన చేయనున్నారు. దీనిద్వారా 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. తిరుపతి రూరల్ తిరుచానూరు వద్ద రూ.200కోట్లతో నిర్మితమైన కోర్టు యార్డు మారియట్ స్టార్ హోటల్ ప్రారంభం కానుంది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300మందికి ఉపాధి లభించనుంది. వీటితో పాటు సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు, సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం శిరసనంబేడు, గూడూరు నియోజకవర్గం కొమ్మనెట్టూరులో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. తిరుచానూరు వద్ద మారియట్ హోటల్‌ను, నాయుడుపేట సెజ్‌లో దమ్ము బయో ఫ్యూయల్స్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించనున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల శంకుస్థాపనలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

రుద్రాభిషేకం ఆలస్యంతో భక్తుల అవస్థలు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం సేవ నాలుగు గంటలు ఆలస్యం కావడంతో భక్తులకు అవస్థలు తప్పలేదు. ముక్కంటి ఆలయంలో రోజూ నాలుగు కాలాల పాటు రుద్రాభిషేకం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో మూడో కాలానికి తప్ప మిగతా అభిషేకాలకు భక్తులను అనుమతిస్తుంటారు. వారాంతపు సెలవులతోపాటు ఆదివారం పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర తోడవడంతో అధిక సంఖ్యలో భక్తులు రుద్రాభిషేకం జరిపించుకునేందుకు టికెట్లు కొనుగోలు చేశారు. రెండో కాల అభిషేకం కోసం ఉదయం 5.30 గంటలకు భక్తులు వచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ముందుగా లక్ష కుంకుమార్చన పూజలను ప్రారంభించారు. దాన్ని కారణంగా చూపుతూ నాలుగు గంటల పాటు రుద్రాభిషేకం భక్తులు నిరీక్షించేలా చేశారు. దీంతో వృద్ధులు, పిల్లల తల్లులు అవస్థలు పడ్డారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు దశాబ్దాలుగా గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, సోమశిల-కండలేరు ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సరిపడా నిధులు ప్రభుత్వాలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు సాగునీటి ప్రాజెక్టులపై ప్రేమ వొలకబోయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత అత్తెసరు నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం అలవాటైపోయిందని దుయ్యబట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ప్రతి జిల్లాకూ 100 టీఎంసీల నీరు అందించే అవకాశముందన్నారు. రూ.4వేల కోట్లు విడుదల చేస్తే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దీంతో పేదలకు వైద్యం అందడం లేదని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలో వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెగిన చెరువుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

‘ఉమ్మడి సర్వీసు రూల్స్’ సమస్య పరిష్కరించాలి

- యూటీఎఫ్ డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న రమణ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ లేకపోవడంతో చాలా రకాల సమస్యలు వస్తున్నాయని, సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మనిగండన్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సర్వీసు రూల్స్ లేకపోవడంతో డీఈవో, డీవైఈవో వంటి క్రియాశీలకమైన, పాఠశాలల్లో తనిఖీ చేయాల్సిన పోస్టులలో ఒక్క ఉపాధ్యాయుడు ప్రమోషన్ పొందకపోవడం శోచనీయమన్నారు. 2010 ముందు నియమించిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. మెగీ డీఎస్సీ తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీలుగా ఉన్న 1043 పోస్టులు పదోన్నతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు రెడ్డప్ప, రెహనాబేగం, బాషా, కృష్ణమూర్తి, సరిత, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సమ్మేటివ్-1 పరీక్షలు జరగనున్నాయి. ఈపరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆయా మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలకు చేరాయి. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు క్లస్టర్ రిసోర్స్ సెంటర్ హెచ్‌ఎంలకు, ఆరు నుంచి పదో తరగతి వరకు ఎంఈవోలు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీవరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.6,7 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, 8,9,10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఏ రోజు ఏ సబ్జెక్టు..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13న మ్యాథమెటిక్స్, 14న ఈవీఎస్ (3,4,5 తరగతులకు), 15న ఓఎస్‌ఎస్‌సీ (3,4,5 తరగతులకు) పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు నుంచి టెన్త్ వరకు 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13న మ్యాథమెటిక్స్, 14న జనరల్ సైన్స్/ఫిజికల్ సైన్స్, 15న బయలాజికల్ సైన్స్, 17న, సోషల్ స్టడీస్, 18న ఓఎస్ఎస్‌సీ పేపర్1, 19న ఓఎస్‌ఎస్‌సీ పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు.

అండర్-14 జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న డీఎస్‌డీవో బాలాజి, టీచర్లు

బంగారుపాళ్యం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-14 బాల, బాలికల జిల్లాస్థాయి ఖోఖో జట్లను ఆదివారం బంగారుపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో డీఎస్‌డీవో బాలాజి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. జిల్లాలోని ఏడు డివిజన్ల నుంచి 150 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొన్నారు. బాలికల విభాగంలో పలమనేరు డివిజన్ జట్టు, బాలుర విభాగంలో శ్రీకాళహస్తి డివిజన్ జట్టు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజేంద్ర, జనార్ధన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబు, శారద, పీఎస్‌హెచ్‌ఎం రాజేష్, పీడీలు లోకేష్, నిరంజన్, మధు, ముత్తు, జ్యోతి, సురేష్ పాల్గొన్నారు.

అండర్ -19 రాష్ట్ర జట్టుకు టేకుమంద విద్యార్థి ఎంపిక



చక్రపాణి

స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర జట్టుకు టేకుమంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చక్రపాణి ఎంపికైనట్లు హెచ్‌ఎం గిరిరాజా ఆదివారం తెలిపారు. ఇటీవల మదనపల్లెలో జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. చక్రపాణిని పీడీ దేవేంద్ర, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలిరెడ్డిగారిపల్లిలో పంటలపై గజ బీభత్సం

● వరి, కొబ్బరి, మామిడి, పనస చెట్ల ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, మామిడిచెట్లు

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు బాలిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు విరిచేశాయి. వరి పంటలను తొక్కేశాయి. పనసచెట్లను ధ్వంసం చేశాయి. కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు మార్గంలోని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఆదివారం పగలంతా ఏనుగుల గుంపు బోడబండవద్ద సంచరించినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

● రోడ్డు మధ్యలో డివైడర్లు



అతికష్టంపై డివైడర్‌ను దాటుతున్న రోగులు

గుడిపాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో 190 రామాపురం సీఎంసీ వద్ద డివైడర్లు వేసి ప్రజల ప్రాణాలతో నేషనల్ హైవే అధికారులు చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు లేన్ల రోడ్డు వెడల్పులో భాగంగా పనులు పూర్తి చేసి ప్లైఓవర్ బ్రిడ్జిని కూడా నిర్మించారు. సీఎంసీ వద్ద చిత్తూరు నుంచి వేలూరు వైపు వచ్చే రోగులు ఆస్పత్రి వద్ద దిగి రోడ్డు దాటాల్సి ఉంది. గత నెల రోజులుగా సీఎంసీ ముందర కిలోమీటరు దూరం వరకు డివైడర్లు వేయడంతో నడిచి వెళ్లడానికి కూడా వీల్లేని పరిస్థితి. వృద్ధులు, దివ్యాంగులు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నారు. గతంలో ఈ రహదారిలో డివైడర్లు లేకపోవడం వల్ల సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడేవారు కాదు. ప్రస్తుతం డివైడర్లతో రోడ్డుదాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా వేసినడివైడర్లను ఎత్తివేయాలని రోగులు కోరుతున్నారు.

తిరుమలలో వైభవంగా కార్తీక వనభోజనం



పార్వేట మండపానికి బయల్దేరిన మలయప్పస్వామి, ఉభయనాంచారులు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా తిరుమలలో ఆదివారం వనభోజన మహోత్సవాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిపై వేంచేపు చేసి, ఆలయం నుంచి ఊరేగింపుగా వాహన మండపానికి తీసుకువచ్చారు. ఉదయం 8.30 గంటలకు సమర్పణ అనంతరం మలయప్పస్వామిని చిన్న గజ వాహనంపై, మరో పల్లకిపై ఉభయనాంచారులను రంగనాయక మండపం నుంచి పార్వేట మండపానికి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్నపన తిరుమంజనం కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ తరఫున భక్తి సంగీత కార్యక్రమాలు, హరికథలు ఏర్పాటు చేశారు.

రాయలచెరువు బాధితులకు రూ.3.24 కోట్ల ప్రభుత్వ సాయం

తిరుపతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో ఓళూరు రాయల చెరువు కట్ట తెగిన ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రూ.3.24 కోట్ల మేరకు ప్రభుత్వ సాయం మంజూరైంది. ఓళూరు పంచాయతీ పరిధిలోని రాయలచెరువు కట్ట ఈనెల 6వ తేదీన తెల్లవారుజామున తెగిపోయిన సంగతి తెలిసిందే. కళత్తూరు దళితవాడలోకి ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తున చెరువు నీరు ప్రవహించడంతో ఇళ్లలోని ధాన్యం సహా సామాన్లు అన్నీ కొట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో పశువులు చనిపోయాయి.పాతపాలెం, ఎస్ఎల్‌పురం గ్రామాలలో కూడా కొంత మేర నష్టం సంభవించింది. ఈమూడు గ్రామాల్లో కలిపి 980 ఇళ్లలోకి చెరువు నీరు చేరింది.నష్టపోయిన 960 కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం కోసం రూ.28.80 లక్షలు, 1,100 పశువులు నీళ్లలో కొట్టుకుపోయిన నేపథ్యంలో ఆయా రైతులకు ఆర్థిక సాయంగా రూ.2.95 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నివేదించారు. అదనంగా బాధిత కుటుంబాలలో ఒక్కో దానికి 25 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, లీటరు పామాయిల్, కిలో ఎర్రగడ్డలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాల్సిన అవసరముందని అభ్యర్థించారు. ప్రభుత్వ మౌఖిక అనుమతితో నిత్యావసర వస్తువులు ఇప్పటికే పంపిణీ చేసేశారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ కారణంగా కుటుంబానికి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం అంగీకరించింది. విపత్తుల సందర్భంగా పాడిపశువులు మృతి చెందితే ప్రభుత్వం పరిహారం ఇచ్చినా పశువుకు రూ.50 వేలు ప్రకటించడం అరుదు. పరిహారం మంజూరుకు సమయం తీసుకుంటుంది. రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో పశువులను కోల్పోయిన బాధితులకు పశువుకు రూ.50 వేలు చొప్పున సాయమందేలా కలెక్టర్ ప్రభుత్వాన్ని ఒప్పించారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

చౌడేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీఈడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడిగా తులసీరాం



నూతన కార్యవర్గం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఈడబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడిగా టీచర్ తులసీరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక విద్యావిహార్ పాఠశాలలో సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీరామ నాగేశ్వరరావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా నారాయణ, పద్మనాభం, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, కోశాధికారిగా మురళీమోహన్, కార్యవర్గ సభ్యులుగా నారాయణ, రాజేంద్ర, హరి, సుబ్బరాయుడు, మురళి, గిరి, శ్రీనివాసులు, యమున, కుమారస్వామి ఎన్నికయ్యారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి : పీఆర్‌టీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న కన్నన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2010 నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, గిరిప్రసాద్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కన్నన్ మాట్లాడుతూ.. పీఆర్‌సీ కమిటీ తక్షణమే నియమించాలని, పెండింగ్‌లోని ఆర్థిక బకాయిలు వీలైనంత త్వరగా చెల్లించాలని కోరారు. ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పే ప్రొటెక్షన్ కల్పనకు సంఘం కృషి చేయాలని సూచించారు.

‘సర్’పై అధికారులకు 14న అవగాహన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రక్షాళన (సర్)పై ఈనెల 14న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు రాయలసీమ పరిధిలోని జిల్లా ఎన్నికల అధికారుల(కలెక్టర్ల)కు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తారు. చిత్తూరు నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు ఏడు నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు విధిగా హాజరుకావాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పరంజ్యోతి, గౌరవాధ్యక్షుడిగా నాగరాజ, స్టేట్ అడ్వయిజరీ కమిటీ మెంబరుగా బాబు, ప్రధాన కార్యదర్శిగా చిట్టిబాబు, కోశాధికారిగా విజయ్‌తోపాటు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కరాటేలో కుప్పం విద్యార్థుల ప్రతిభ



పోటీలలో విజేతలైన చిన్నారులు

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో ఈనెల మొదటి వారంలో జరిగిన ఆలిండియా కరాటే పోటీలలో కుప్పానికి చెందిన పలువురు చిన్నాలు ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. కుమిటే విభాగంలో ఎన్.రోషన్ ప్రథమ స్థానంలోనూ, యశ్వంత్, హరినారాయణ మితికలు తృతీయ స్థానంలోనూ గెలుపొందారు. అలాగే కట్టా విభాగంలో బి.హరినారాయణ, దీప్తి, ప్రశాంత్, జానులు ప్రథమ, యశ్వంత్, మితిక, దీక్షిత్, ఎన్.రోషన్‌లు ద్వితీయ, క్లారిక తృతీయ స్థానాల్లో నిలిచారు. కరాటే మాస్టర్లు ఆర్.నంద కుమార్, కె.సింగారవేలు, వై.ప్రతాప్, ఎం.దినేశ్‌లు ఈ చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కుప్పం బాలిక



తేజశ్రీ

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక తేజశ్రీ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం గ్రామంలో ఈనెల 5వ తేదీన జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో తేజశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆమె రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించింది. తేజశ్రీ మూడుసార్లు యోగా పోటీలలో పాల్గొని మూడేళ్ల వరుసగా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు



వెంకటరమణ, జయశంకర్, కృష్ణానాయక్‌లను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

రామకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడే కార్యకర్తలకు, నేతలకు టీడీపీ తప్పకుండా గుర్తింపునిస్తుందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. వెంకటరమణతోపాటు కుప్పం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన కృష్ణానాయక్, జయశంకర్‌లను ఆదివారం ఉస్సిగానిపల్లె పంచాయతీ టీడీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు దక్కలేదని ఎవరూ నిరాశ పడొద్దని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో విజలాపురం యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, కడ పీఏసీ సభ్యుడు రఘు, సాగునీటి సంఘం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, టీడీపీ పంచాయతీ అధ్యక్ష, మాజీ అధ్యక్షులు మణేష్, కృష్ణారెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, నేతలు మహేంద్రనాయుడు, భువన్‌రెడ్డి, రామలింగం, బీరప్ప, షణ్ముగం, సుభాష్, మంజునాథరెడ్డి, కేశవులు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



టీడీపీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, టీడీపీ నేతలు

వి.కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల తెలుగు యువత అధ్యక్షుడు ధీరజ్ నూతనంగా ముద్రించిన 2026 క్యాలెండర్లను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా వి.కోటలో ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన మండల స్థాయి సమావేశంలో పార్టీ వ్యవస్థాపకులు దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యక్రమాలతో వినూత్నంగా ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరించి నేతలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రంగనాథ్, రామచంద్రనాయుడు, రాంబాబు, చౌడప్ప, బాలాజీ, రుహుల్లా, శబరీష్, ఈశ్వర్, నాగరాజు, నారాయణస్వామి, హరినాథరెడ్డి, సుబ్బన్న తదితరులు ఉన్నారు.

దుర్గామాత ఆలయ ధర్మకర్తగా రఘుపతినాయుడు



దుర్గామాత ఆలయ నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

వి.కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వి.కోట దుర్గామాత ఆలయ ధర్మకర్తగా జి.రఘుపతి నాయుడు ఎంపికయ్యారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఆలయ నూతన కమిటీ ఎంపికకు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ నూతన ధర్మకర్తగా రఘుపతినాయుడు, ఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ బాబు, జనార్దన్, బాలాజీ, కోశాధికారిగా తుకారంలతో పాటు ఇతర కమిటీని ఎంపిక చేశారు. నూతన కమిటీ అమ్మవారి ఆలయ నిర్వహణలో మరింత బాధ్యతతో పనిచేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ధర్మకర్తలు దామోదర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, రమేష్ బాబు, సభ్యులు రామచంద్రనాయుడు, రంగనాథ్, ఆనందరెడ్డి, దవనం భక్తా, పార్థసారధి, ఎం.సీ.కృష్ణప్ప, కమల్‌రాజు, చలంరాజు, సుధాకర్‌రెడ్డి, మహేష్, కార్తీక్, మహేష్, శివ, ప్రతాప్, వెంకటేష్, పూనారా, దక్లారాం, గ్యానారం, రాజాబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు గుర్తింపుతోపాటు అభివృద్ధి చెందారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అంజుమాన్ జామితుల్ ఇస్లాం కమిటీ, ముతవల్లీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరులో అధికంగా ఉన్న ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు విద్యాశాఖామంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు తన వంతు కృషి చేస్తానని, వచ్చే ఏడాది ప్రారంభించేలా ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు సయ్యద్‌సుహేల్‌బాషా, ఇబ్రహీం, షామీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ డే రద్దు

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వందేమాతరం దేశభక్తిని నింపిన గేయం



పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు

పలమనేరు, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : స్వాతంత్య్ర సమర సమయంలో ప్రజల్లో దేశభక్తిని నింపిన గేయం వందేమాతరమని ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు పేర్కొన్నారు. ఆదివారం వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలమనేరు నార్త్ పాఠశాలలో రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి జాతీయ జెండాకు పూలమాల వేసి వందనం చేశారు. అనంతరం అందరూ వందేమాతరం గీతం ఆలపించారు, కార్యక్రమంలో నాయకులు గురుస్వామి నాయుడు, మోహన్, అక్బర్‌బాషా, ఆంజప్ప, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రెడ్డెప్ప, మస్తాన్, నాగభూషణం, రెడ్డెమ్మ, సోమశేఖర్, సాంబయ్య, వెంకటేసు, వినాయకం, వేణుగోపాల్‌శెట్టి పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు

సదుం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ పెన్షనర్లు వాపోయారు. ఆదివారం సదుంలో మండల పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ పెన్షనర్లు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరస్పరం ఆరోగ్య, యోగక్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఆరోగ్య బీమా కోసం పెన్షనర్ల నుంచి నెలసరి రూ.300 ప్రభుత్వం కట్టించుకుంటోందని, అయితే పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరడం లేదని, ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నటరాజ, రాజా రెడ్డి, కృష్ణారెడ్డి, మల్ రెడ్డి, మోహన్ రెడ్డి, సహదేవయ్య, తిమ్మయ్య, నాగరాజా, సుబ్రహ్మణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మునివెంకటప్ప మృతి



నివాళులర్పిస్తున్న వెంకటరమణ తదితరులు

రామకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరుకు చెందిన రెస్కో డైరెక్టరు సతీష్ తండ్రి, టీడీపీ సీనియర్ నేత మునివెంకటప్ప ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. రెస్కో చైర్మన్ ప్రతాప్, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ పార్టీ నేతలతో కలిసి సతీష్‌ను పరామర్శించి మునివెంకటప్పకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నవీన్, కడ పీఏసీ సభ్యుడు రఘు, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు మురళీధర్, నేతలు మురళీమోహన్, మంజునాథరెడ్డి, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, మునిరెడ్డి, దివాకర్, మురళీ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు




రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే దాదాపు 40మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పెద్దిరెడ్డి సంతాపం

సదుం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకువారిపల్లెలో వైసీపీ నాయకుడు మోహన్‌రెడ్డి భార్య సీపీ రమాదేవి(73) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం చెరుకువారిపల్లెకి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

12న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న వైసీపీ చేపట్టే ర్యాలీ విజయవంతం చేయాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరు ప్రైవేటు బస్టాండ్‌లో వైసీపీ నాయకులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి ఎన్.అనీషారెడ్డి, ఎన్.శ్రీనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రాగానిపల్లె బాబు, రాజేశ్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సమన్వయంతోనే పార్టీ పటిష్ఠత

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమన్వయంతోనే పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. ఆదివారం వి.కోటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా యడగురికి గ్రామానికి చెందిన ఈశ్వర్, ఉపాధ్యక్షుడిగా ముమ్మిడేర్లపల్లెకు చెందిన ఏ.ఆర్.నాగరాజు, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఖాజీపేటకు చెందిన నాసీర్, బీసీసెల్ అధ్యక్షుడిగా ముదరం దొడ్డి సర్పంచ్ దామోదర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా సుద్దులకుప్పానికి చెందిన ఆర్.రాంబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కపట్లబండకు చెందిన ధర్మప్ప, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలిగా తోటకనుమ మాజీ సర్పంచ్ సుకన్య, మండల రైతు అధ్యక్షుడిగా సి.ఎల్లాగరంకు చెందిన దివాకర్‌రెడ్డి, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా లక్ష్మన్‌చౌదరిలను ప్రకటించారు. అనంతరం వారిచే ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. 30 ఏళ్లగా పార్టీలో చేసిన సేవలను గుర్తించి తనకు మండల పార్టీ అధ్యక్ష బాధ్యత అప్పగించడంపై బి.ఆర్.రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరి సమిష్టి కృషితో మండలానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. గత వైసీపీ హయంలో పార్టీ కోసం పనిచేసిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేశారని, వారందరికీ తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. పీఎంకే ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు. రాష్ట్ర వేర్‌హౌస్ డైరెక్టర్ రాంగనాథ్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గజేంద్ర, సూపర్‌బజార్ అధ్యక్షులు బాలాజీ, పీపీసీఎస్ అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి, మాజీ జడ్పీటీసీలు చౌడప్ప, విశ్వనాథ్, రెస్కో డైరెక్టర్ చంద్రారెడ్డి, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి, నేతలు ధీరజ్, శబరీస్, రుహుల్లా, భక్తా, సుబ్రహ్మణ్యంశెట్టి, గుణ, బాలసుందరం, రఘుపతి, మునిరత్నం, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమానికి హాజరైన టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ బోడినాయునిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్చకులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరు కాగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ హనుమంతుల కరుణా కటాక్షంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పుంగనూరు అభివృద్ధి జరగాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు దామోదరం, మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, రమేష్‌రెడ్డి, ఉయ్యాల రమణ, శ్రీకాంత్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సాధన కోసం పోరాటం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘనాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల సాధన కోసం ఐకమత్యంతో ముందుకు వెళ్లాల్సిన అవసరముందని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాణావత్ చక్రినాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరు మండలం సుగాలిమిట్ట సమీపంలోని సేవాఘడ్‌లో అన్నమయ్య, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన తాండాల్లోని గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తాండాల్లో కమిటీలు వేసి సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాల్సి ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీలు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్, రాష్ట్ర నాయకులు చౌహాన్, వెంకటరమణ నాయక్, రామచంద్రనాయక్, జిల్లా అధ్యక్షుడు నాగూనాయక్, కార్యదర్శి శంకర్‌నాయక్, రవీంద్రనాయక్, రెడ్డినాయక్, మనోజ్‌నాయక్, వెంకటేశ్‌నాయక్, నాగరాజ నాయక్, పవన్‌కుమార్, హరినాయక్, దేశానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పుంగనూరు బైపాస్‌రోడ్డులో జరిగింది. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన షావలి(26)) ఆరీఫ్(24)లు సొంత పనులపై మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రొంపిచెర్లలో నలుగురి ఇళ్లల్లో చోరీ

రొంపిచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులూపేటలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ధన, వినిత , సునీల్, దీప ఇళ్లల్లో నగదు, నగలు చోరీ చేసుకెళ్లారు. మరో ఇంటి తాళాలు పగులగొడుతుండగా పక్కంటి వారు చూడటంతో దొంగలు పారిపోయారు. పోలీసులు ఆదివారం చేరుకుని పరిశీలించారు.

- స్వాగతం



పలమనేరులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యనిపుణులు 42 మందికి కంటి పరీక్షలు చేసి 26 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థిని ఎంపిక



లోకేశ్వరి

బైరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అండర్-19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని తీర్థం జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని లోకేశ్వరి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీపతి తెలిపారు. ఈనెల 10వ తేదీన విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో లోకేశ్వరి పాల్గొనసుందని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని రెండు ఎస్సీ హాస్టళ్లను ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో అందుతున్న మెనూ వివరాలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. కురిసి న వర్షాలకు ఎదురైన సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలువురు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, రాజన్న, ఖాజా, టీఆర్‌సీ కుమార్, నాగరాజరెడ్డి, దిలీప్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

శ్రమదానంతో పుంగనూరు పుష్కరిణిలో పూడికతీత

- 17న కార్తీక దీపోత్సవ ఏర్పాట్లు

పుంగనూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు ల్యాండ్‌మార్క్‌గా నిలిచిన అద్భుత శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన పురాతన పుష్కరిణి శుభ్రత, పూడికతీత పనులు ఆదివారం హిందూజాగరణ సమితి సభ్యులు, హైందవులు, యువత శ్రమదానంతో పనులు ప్రారంభించారు. గత 15 ఏళ్లుగా స్థానిక బైపాస్ రోడ్డులో పరమశివుడికి ప్రీతికరమైన కార్తీకమాసం సోమవారాల్లో హిందూజాగరణ సమితి, తుంగా మంజునాథ్, భక్తులు అత్యంత వైభవంగా కార్తీక లక్ష దీపార్చన కొనసాగిస్తున్నారు. కాగా ఈఏడాది కోనేరులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడంతో నిండుకున్న పుష్కరిణిలో నీటిని తోడి కొత్తనీటిని నింపి పుణ్యావాచనం, సంప్రోక్షణ కార్యక్రమాలు చేయకుండా కార్తీక దీపోత్సవం నిర్వహించరాదని నిలిపేశారు. పుంగనూరు హిందువులు కార్తీక దీపాలు పెట్టడం లేదని ఆందోళన చెందుతుండగా ఈనెల 17న చివరి కార్తీకమాస సోమవారం కోనేరులో లక్షదీపార్చన నిర్వహించాలని హిందూజాగరణ సమితి ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో హిందూ జాగరణ సమితి ప్రతినిధులు పరమేశ్, హరి, గంగాధర్, త్రిమూర్తిరెడ్డి, సాయి, సభ్యులు, హిందూ భక్తులు, యువకులు, మహిళలు సైతం ఆదివారం చేపట్టిన శ్రమదానం పనుల్లో పాల్గొన్నారు. నిండుకుండలా ఉన్న కోనేరులోని నీటిని మోటార్లతో బయటకు పంపింగ్ చేసి కోనేరుతోపాటు అందులోని బావి వరకు పూడికతీసి శుభ్రం చేశారు. దాతల సహకారంతో ఇదివరకు కోనేరు తూము వద్ద పనులు చేయగా ఇంకా కోనేరు నీరు బయటకు వెళ్లడం, లీకేజీ, మరమ్మతు పనులకు రూ.15 లక్షలు వ్యయం కానుంది. త్వరలో పుష్కరిణిలో నూతనంగా మంచినీటిని నింపి వేదపండితులచే శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు అనంతరం వచ్చే సోమవారం వైభవంగా కోనేరులో కార్తీక లక్ష దీపార్చన జరుగుతుందని హిందువులు ఆనందం వ్యక్తం చేశారు. హిందూ జాగరణ సమితి, శ్రమదానం చేసిన యువతను అభినందిస్తున్నారు.



పుష్కరిణిలో జరుగుతున్న పూడికతీత పనులు



పుష్కరిణిలో పూడికతీత పనులు చేపట్టిన హిందూజాగరణ సమితి ప్రతినిధులు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



పలమనేరులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత

తుఫాన్ బాధితుల్ని ఆదుకుంటాం: థామస్


చౌటూరులో జ్ఞానమ్మకు చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితుల్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. ఆదివారం కార్వేటినగరం మండలం చౌటూరు గ్రామంలో తుఫాను వల్ల ఇల్లు కోల్పోయిన జ్ఞానమ్మకు ప్రభుత్వం తరఫున రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ.. బాధితురాలికి మరో రూ.90వేలతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.2.35 లక్షలు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్‌ఐ నరసింహులు, పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్ధనరాజు, టీడీపీ నేతలు మాదిరాజు మురళీకృష్ణ, వి.రాజా పాల్గొన్నారు.

అర్ధగిరి వీరాంజనేయుడి సేవలో లోకాయుక్త



తవణంపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని కర్నూలు లోకాయుక్త రజని ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు, ఈవో మునిశేఖర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వేడుకగా కార్తీక వన భోజనాలు


కమ్మ సంఘం క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

తవణంపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమ్మకుల అభ్యున్నతికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం కాణిపాక పట్నం వద్ద ఉన్న మామిడి రిసార్ట్‌లో చిత్తూరు కమ్మ వారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. డాక్టరేట్ పొందిన జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నకేశవులునాయుడిని సంఘ సభ్యులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు పల్లె కేశవులు నాయుడు, ఉపాధ్యక్షుడు ధనంజయ నాయుడు, కార్యదర్శి సతీష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, దుర్గా రామకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాది ఇంట్లో చోరీ

● 30 గ్రాముల బంగారు నగలు, రూ.40వేల అపహరణ

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ న్యాయవాది ఇంట్లో చోరీ జరిగింది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గిరింపేట కృష్ణానగర్‌లో న్యాయవాది బాలకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. వీరు వారం కిందట ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం వచ్చి చూస్తే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలకెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 30 గ్రాముల బంగారు నగలు, రూ.40వేలు కనిపించలేదు. దాంతో బాలకుమార్ కుమారుడు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పుంగనూరు బైపాస్‌రోడ్డులో జరిగింది. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన షావలి(26)) ఆరీఫ్(24)లు సొంత పనులపై మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


పీబీ అగ్రహారంలో నిర్మాణం పూర్తికాని అంగన్‌వాడీ కేంద్ర భవనం

ఇంకెన్నాళ్లిలా..?

● పదేళ్లుగా అసంపూర్తిగానే అంగన్‌వాడీ కేంద్ర భవనాలు

గంగాధరనెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీబీ అగ్రహారం, పాతవెంకటాపురంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయి ఉన్నాయి. పీబీ అగ్రహారంలోని భవనం మోల్డింగ్ దశవరకు జరిగింది. ఆ తర్వాత పనులు ముందుకు సాగలేదు. దీంతో ఈ భవనాన్ని కొందరు పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. పాతవెంకటాపురంలోని భవనాన్ని రోడ్డు కంటే పల్లంలో నిర్మాణం చేపట్టినా పనులు పూర్తి కాలేదు. ఇకనైనా ఈ రెండు భవనాల్లోని పెండింగ్ పనులను పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


పాతవెంకటాపురంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

నారా భువనేశ్వరికి సన్మానం


భువనేశ్వరితో రాజేశ్వరి

చిత్తూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి సన్మానించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో భువనేశ్వరి.. ఇటీవల 'డిస్టింగ్విష్ ఫెలోషిప్ - 2025' పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు నేత్రవైద్య ఉచిత శిబిరం

బంగారుపాళ్యం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శంకర్ నేత్రాలయం, చెన్నై వారి ఆధ్వర్యంలో నేత్రవైద్య ఉచిత శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. శిబిరానికి వచ్చేవారంతా ఆధార్ కార్డు తేవాలని సూచించారు.

నీరు లేక వెలవెలబోతున్న కాజూరు చెరువు

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు


నీరులేక ముళ్ల చెట్లతో నిండిన కాజూరు చెరువు

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా చెరువులు నిండి మొరవ పోతున్నా.. చిత్తూరు నగరంలోని కాజూరు చెరువు మాత్రం నీరు లేక వెలవెలబోతోంది. పైగా ముళ్లకంపలతో నిండిపోయి ఉంది. దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు చెబుతున్నారు. నగరంలో కాజూరు, కట్టమంచి, గంగినేని, దుర్గానగర్ చెరువులున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాజూరు చెరువు తప్ప మిగిలిన చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. కాజూరు చెరువు నిండితే కాజూరు, పోతంబట్లు, జానకాకరపల్లె, శంకరయ్యగుంట, బీఎంఆర్‌గార్డెన్ ప్రాంతాల బోర్లలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీవానది పొంగిపొర్లుతోంది. ఆ నీటిలో కొంత భాగాన్ని కమ్మరాయనిమిట్ట వద్ద ఉన్న కాలువ ద్వారా చెరువుకు మళ్లిస్తే నిండే అవకాశం ఉంది. ఇకనైనా ముళ్లకంపలను తొలగించి.. చెరువులోకి నీరు చేరే ఏర్పాట్లు చేయాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ విక్రమ్

నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మ రక్షణకు కరాటే ఉపయోగపడుతుందని సీఐ విక్రమ్ తెలిపారు. జపాన్ షిటోరాయ్ కరాటే స్కూలులో శిక్షణ పూర్తయిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ఆదివారం ప్రదానం చేశారు. కరాటే మాస్టర్లు అన్నాదొరై, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగినా తీరు మారదా?

సైలెంట్ బ్లాస్ట్ చేయాలని అధికారులు ఆదేశించినా పట్టించుకోని ప్రైవేటు కంపెనీ
భయాందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


బ్లాస్ట్‌లో దెబ్బతిన్న ఇంటి పైకప్పు


బెడ్‌రూంలో పడిన రాళ్లు

చిత్తూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా చీలాపల్లె సీఎంసీ పరిసర ప్రాంతమైన కనికాపురం గ్రామం వద్ద దారికి అడ్డుగా ఉన్న కొండను తొలగించే పనులను ఎంసీ అనే ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. ఈ కంపెనీవారు కొన్నిరోజులుగా పెద్ద పెద్ద బాంబులు వాడి కొండను బ్లాస్ట్ చేస్తున్నారు. ఈ కారణంగా రాళ్లు గతంలోనే రోడ్డు పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులపై పడి తీవ్రగాయాలతో మృతి చెందారు. దాంతో పోలీసులు, ఉన్నతాధికారులు సైలెంట్ బ్లాస్ట్ చేయాలని కంపెనీని ఆదేశించారు. అయినా ఆ కంపెనీ ప్రతినిధుల తీరు మారలేదు. మళ్లీ పెద్ద బ్లాస్ట్‌లు చేస్తున్నారు. శనివారం ఈ బ్లాస్ట్ కారణంగా పెద్ద పెద్ద రాళ్లు చుట్టుపక్కల ఉన్న ఇళ్లపై పడ్డాయి. కొన్ని రాళ్లయితే ఇంట్లో నిద్రిస్తున్న కార్మికులపై పడగా గాయాలతో తప్పించుకున్నారు. ఈ బ్లాస్ట్ జరుగుతున్న ప్రాంతలో అనేక గ్రామాలు, కంపెనీలు ఉన్నాయి. వారంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రాణం పోకముందే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

థామస్ చొరవతో రహదారికి మరమ్మతులు


కొట్టుకుపోయిన రోడ్డు వద్ద యంత్రాల సాయంతో చేస్తున్న పనులు

పెనుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పంచాయతీ పరిధిలోని తూపల్లె నుంచి బండపల్లెకు వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు నీవానదిలో నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. సుమారు 10 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గత నెల 31వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఎల్లంపల్లెలో పల్లెనిద్ర చేశారు. గ్రామస్తులు ఈ రహదారి సమస్యను ఆయనకు తెలియజేశారు. స్పందించిన ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఈ క్రమంలో స్థానిక నేత యువరాజులునాయుడు గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌ను కలవగా మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. దీంతో ఆదివారం నుంచి పనులు మొదలయ్యాయి.

కళత్తూరు దళితవాడవాసులకు సాయం


బాధితులకు నిత్యావసరాలను అందజేస్తున్న నాయకులు

నింద్ర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓళ్లూరు రాయలచెరువు తెగడంతో సర్వం కోల్పోయిన కేవీబీపురం మండలంలోని కళత్తూరు దళితవాడవాసులకు నింద్ర గ్రామ సర్పంచ్ వసంత బాబురెడ్డి, కొప్పేడు మాజీ సర్పంచ్ అనిల్ తమవంతు సాయం అందజేశారు. వంద బాధిత కుటుంబాలకు రూ.80వేల విలువైన నిత్యావసర వస్తువులను పిచ్చాటూరులో ఆదివారం అందజేశారు.

సీకే లావణ్యకు జన్మదిన శుభాకాంక్షలు



చిత్తూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి లావణ్య జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం సీకే బాబు నివాసంలో ఆమెకు దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు, శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

దుర్గంధం

● కొత్తకోట ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఇదీ పరిస్థితి


ప్రభుత్వాస్పత్రి క్వార్టర్స్ వద్ద చెత్తాచెదారం - బురదమయంగా ఉన్న దారి

పూతలపట్టు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట ఆస్పత్రి క్వార్టర్స్ వద్ద చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీనివల్ల ఇక్కడికొచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షమొస్తే పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. రాత్రయితే దోమల బెడద కూడా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రికొస్తే కొత్త జబ్బులు వస్తాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందే మలుపులు.. ఆపై పిచ్చి మొక్కలు

● ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు


కుప్పిగానిపల్లె వద్ద ప్రమాదకరమైన మలుపు

గుడిపాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. పైగా ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు కూడా లేవు. దీనివల్ల ఈ మార్గాల్లో కొత్తవారు వస్తే ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు గాయపడి ఆస్పత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


నాగేంద్రపురం, మండికృష్ణాపురం రోడ్లపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

చెరకు రైతులకు తప్పని తిప్పలు

విజయపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. విజయపురం మండలంలో సుమారు 700 ఎకరాలలో చెరకు సాగవుతోంది. మండలానికి దగ్గరలో నింద్ర క్రాస్ వద్ద ఉన్న నేతం చెరకు కర్మాగారం సుమారు రూ.30 కోట్ల బకాయిలను తమకు చెల్లించకుండా మూతపడటంతో కష్టాలు మొదలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సాగు అవుతున్న చెరకును పళ్లిపట్టు సమీపంలోని నెలవాయి సాగర్ చెరకు కర్మాగారానికి, తమిళనాడు తిరువళాంగాడు ప్రభుత్వ చెరకు కర్మాగారానికి, సెంజి, మదురై, కర్ణాటక ప్రాంతాలకు రవాణా చేయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు ఎక్కువై ధర గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. చిత్తూరు, గాజులమండ్యం వద్ద మూతబడిన ప్రభుత్వ చెరకు సహకార కర్మాగారాలు తెరిస్తే ఇబ్బందులు తప్పుతాయని చెబుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వ అధికారులు, పాలకులు దృష్టి సారించాలని కోరుతున్నారు.


ఎం.అగరంలో నిల్వ ఉంచిన చెరకు


ఇళ్లత్తూరులో చెరకును ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న రైతులు

సంక్షిప్తంగా..

నగరపాలక కార్యాలయంలో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భద్రకాళికి ప్రత్యేక పూజలు

గుడిపాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట చెక్ పోస్టుకు సమీపంలోని భద్రకాళి ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

'టీడీపీ సిద్ధాంతాలు అతిక్రమించొద్దు'

గుడిపాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సిద్ధాంతాలను అతిక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని గుడిపాల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు హెచ్చరించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిద్రాహారాలు మాని కష్టపడి పార్టీని అధికారంలోకి తెస్తే.. కొందరు పార్టీని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారన్నారు. పార్టీని బలోపేతం చేయాలే తప్ప ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోరాదని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పార్టీ నాయకుల దృష్టికి తేవాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


భార్గవి

బంగారుపాళ్యం, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఊటువంకకు చెందిన భార్గవి(30) గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. చుట్టుపక్కల, తెలిసిన వారిళ్లలో గాలించినా ఆచూకీ లభించక పోవడంతో భర్త హరికృష్ణ శనివారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం సీఐ తెలిపారు.

కోసలనగరంలో సంతకాల సేకరణ

విజయపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ కోసలనగరంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు నిర్వహించారు. ఎంపీపీ మంజు బాలాజి, వైసీపీ నాయకులు శివరాజు, శేఖర్ రాజు, సతీష్‌యాదవ్, గుణశేఖర్‌రెడ్డి, చెంచు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కుప్పం బాలిక


తేజశ్రీ

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక తేజశ్రీ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం గ్రామంలో ఈనెల 5వ తేదీన జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో తేజశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆమె రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించింది. తేజశ్రీ మూడుసార్లు యోగా పోటీలలో పాల్గొని మూడేళ్లు వరుసగా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

రొంపిచెర్లలోని నలుగురి ఇళ్లలో చోరీ

రొంపిచెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులూపేటలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ధన, వినిత, సునీల్, దీప ఇళ్లలో నగదు, నగలు చోరీ చేసుకెళ్లారు. మరో ఇంటి తాళాలు పగులగొడుతుండగా పక్కింటి వారు చూడటంతో దొంగలు పారిపోయారు. పోలీసులు ఆదివారం చేరుకుని పరిశీలించారు.